సీఎం కార్యక్రమంలో ఏర్పాట్ల లోపం

ఇబ్బంది పడిన అధికారులు, ప్రజలు

రాయదుర్గం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోపనపల్లి తండా సర్కిల్‌లో 28.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫ్లై ఓవర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలకు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా హాజరయ్యారు. అయితే సీఎం మీటింగ్‌లో అధికారులు ఏర్పాట్లు సరిగ్గా చేయకపోవడంతో వర్షంలో కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజలు వర్షంలో తడుస్తూనే ఉన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఆర్ అండ్ బీ విభాగం అధికారులు తగినంతగా టెంట్లు ఏర్పాటు చేయలేదు. వచ్చిన వారికి తాగునీటి ఏర్పాట్లు సైతం చేయకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో ప్రజలతో పాటు విధులు నిర్వహిస్తున్న అధికారులు సైతం ఇబ్బంది పడ్డారు. కనీస సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.


ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

● పోలీసుల అత్యుత్సాహం

సభాస్థలి వద్దకు ప్రొటోకాల్‌లో పేర్లు ఉన్న వారిని మాత్రమే అనుమతించి ద్వితీయ శ్రేణి నాయకులు, స్థానికంగా గుర్తింపు ఉన్న నాయకులను అనుమతించలేదు. కార్యకర్తల ముందు తమ పరువు కాపాడుకునేందుకు వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

● తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

ఈ ఫ్లై ఓవర్ ప్రారంభంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పట్టనుంది. రూ.28.5 కోట్ల వ్యయంతో వన్‌వేలో మాత్రమే వాహనాలు వెళ్లేందుకు నిర్మించారు. దీంతో సాయంత్రం వేళల్లో నానక్‌రామ్‌గూడ, గౌలిదొడ్డి నుంచి తెల్లాపూర్, నల్లగండ్ల, లింగంపల్లి కొల్లూరు, పటాన్‌చెరు వైపు వెళ్లే వాహనదారులకు తండా సర్కిల్‌ను దాటుకొని వెళ్లేందుకు వీలు కలుగుతుంది. అయితే ఉదయం సమయంలో లింగంపల్లి, తెల్లాపూర్, కొల్లూరు, నల్లగండ్ల, పటాన్‌చెరు వైపు సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ ఐటీసెజ్ ప్రాంతాల వైపు ప్రతీరోజు వేలాది వాహనాలు ఫ్లై ఓవర్ కింది నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అదే సమయంలో లింగంపల్లి నుంచి వట్టినాగులపల్లి, గండిపేట్, మొయినాబాద్ వైపు బస్సులు వెళ్తాయి. దీంతో ఉదయం సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్‌పటేల్, జగదీశ్వర్‌గౌడ్, స్థానిక నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, రాజునాయక్, సురేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోలీసులతో బాహాబాహీకి దిగిన బస్తీవాసులు

గౌలిదొడ్డి గ్రామ పరిధిలోని బసవతారకనగర్ బస్తీవాసులు సీఎం రేవంత్‌రెడ్డికి తమ సమస్యలను చెప్పడానికి ప్రయత్నించారు. అయితే పోలీసులు అనుమతించకపోవడంతో కార్యక్రమం ముగిసిన తర్వాత అయినా తమ సమస్యలను చెప్పుకునే అవకాశం వస్తుందేమోనని వేచి చూశారు. సమావేశం ముగిశాక సీఎం కారు ఎక్కుతున్న సమయంలో ఆయన దగ్గరకు వెళ్లేందుకు బస్తీవాసులు ప్రయత్నించారు. వారిని అడ్డుకోవడంతో బస్తీవాసులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.


మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

దేశాభివృద్ధి కోసం ప్రధాని నిరంతరం కృషి

చందానగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతర కృషి చేస్తున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం, కృతజ్ఞతసభ చందానగర్‌లోని క్రిస్టల్‌గార్డెన్‌లో మారబోయిన రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొండా విశ్వేశ్వరరెడ్డి హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠత కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, కో కన్వీనర్ మణిభూషణ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేష్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, పవన్, సీనియర్ నాయకులు అశోక్, నాగులుగౌడ్, వసంత్‌యాదవ్, రామరాజు, నవతారెడ్డి, వినయ, పద్మ, వివిధ డివిజన్ల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

కేసులు పెండింగ్‌లో ఉండొద్దు: డీసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల్లో పని చేస్తున్న పోలీస్ అధికారులతో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు, వారెంట్ పెండింగ్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్ ఉంటే త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీలు రాములు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సమస్యలకు పరిష్కారం


మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్, చిత్రంలో అపూర్వ్ చౌహాన్, ఉపేందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శాఖల మధ్య సమన్వయం ఉండేలా అధికారులు చొరవ తీసుకుంటే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్‌లకు సంబంధించి హైడ్రా, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా తీసుకోవాల్సిన అంశాలపై జేఎన్‌టీయూలో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చూడగలిగితే ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాలతో పాటు వ్యర్థాలను తక్షణమే తొలగించాలన్నారు. అంతకుముందు జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, ఉపేందర్‌రెడ్డి, ఎస్‌ఈలు చిన్నారెడ్డి, శంకర్, ఇతర శాఖల సూచనలు, సలహాలు స్వీకరించారు. సీఆర్‌ఎంపీ, ఎమర్జెన్సీ, డీఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్న తీరును ఎప్పటికప్పుడు శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సమస్య వచ్చినప్పుడు ఎలా పరిష్కరించాలో ఆలోచించాలే తప్పా.. తప్పించుకునే ప్రయత్నం చేయకూడదన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, కాంట్రాక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మేడ్చల్ ఓబీసీ మోర్చా అర్బన్ జిల్లా కార్యదర్శిగా రవియాదవ్

గాజులరామారం, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శిగా నిజాంపేట్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రవియాదవ్ నియమితులయ్యారు. గాజులరామారం డివిజన్‌లోని మహారాజ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి సమక్షంలో రవియాదవ్‌కు నియామకపత్రాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి, ఈ బాధ్యతను అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంగేష్‌కుమార్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు క్యారమ్స్ పోటీలు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ భవనంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యారమ్స్ ఆడిన ఆయన.. చిన్నారులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. క్రీడలతో ఏకాగ్రతతో పాటు మానసిక ధైర్యం పెంపొందించొచ్చన్నారు. ఇష్టంతో ఆడే క్రీడ ఏదైనా ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

జీడిమెట్ల: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించినప్పుడే సమాజం ముందుకు పోతుందని కుత్బుల్లాపూర్ బీజేపీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ అన్నారు. జగద్గిరిగుట్ట సమైక్య గ్రూప్‌కు 21 వేల రూపాయల విలువ చేసే మూడు కుట్టు మిషన్‌లను ఆయన బహూకరించారు. శనివారం జగద్గిరిగుట్టలో జరిగిన కార్యక్రమంలో ఆయన కుట్టు మిషన్లను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ ప్రాజెక్టు అధికారి హరిప్రియా, సీఓ కిషోర్, ఆర్‌పి అనురాధా, గ్రూపు అధ్యక్షురాలు వరలక్ష్మి, విజయ్‌రెడ్డి, వెంకటమ్మ, పాల్గొన్నారు.

బోనాలను ఘనంగా నిర్వహించుకోవాలి

జీడిమెట్ల: తెలంగాణ సాంప్రదాయ ఉత్సవాలైన బోనాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట వేంకటేశ్వరాస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను పంపిణీ చేశారు. 106 ఆలయాలకు గాను 29 లక్షల 48 వేల రూపాయాల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఆలయ ఈవో, కార్పొరేటర్ కె.జగన్, మంత్రి సత్యనారాయణ, వేణుయాదవ్ పాల్గొన్నారు.

వర్షంతో చిత్తడిగా మారిన రోడ్లు

చందానగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రోడ్లు చిత్తడిగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. చందానగర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, కొండాపూర్, హఫీజ్‌పేట, మదీనగూడ, మియాపూర్ ప్రాంతాల్లో రహదారులు జలమయంగా మారాయి. ఏకదాటిగా వర్షం కురుస్తుండటంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు తడిసి ముద్దయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌జాంలు ఏర్పడ్డాయి.

రోడ్లపై నిలిచిన నీటితో అవస్థలు

పేట్‌బషీరాబాద్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి జీడిమెట్ల డివిజన్‌లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెన్నెల గడ్డ నుంచి జీడిమెట్ల గ్రామానికి వెళ్లే ప్రభుత్వ పాఠశాల, మీనాక్షి వైన్స్ సమీపంలో రోడ్డుపై వర్షం నీరు నిలిచింది. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని శివాజీ విగ్రహం సమీపంలోని ప్రధాన రహదారిలో నీరు రోడ్డుపై నిలవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

అందరూ మొక్కలు నాటి రక్షించాలి

గాజులరామారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్నతనం నుంచే మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని ఓ స్కూల్లో శనివారం హరితహారం కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఇంటి వద్ద మొక్కలు నాటాలి

పేట్‌బషీరాబాద్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతీ ఒక్కరు ఇంటి వద్ద మొక్కలు నాటుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్ అన్నారు. శనివారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఓ స్కూల్లో విద్యార్థులు నిర్వహించిన గ్రీన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఎల్ఐజీ గృహాలను సందర్శించిన హౌసింగ్ బోర్డు కార్యదర్శి


ఎల్ఐజీ గృహసముదాయాన్ని పరిశీలిస్తున్న రాజేశం తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐజీ గృహాలు అర్థాంతరంగా ఎందుకు నిలిచిపోయాయని హౌసింగ్‌బోర్డు కార్యదర్శి రాజేశం స్థానిక హౌసింగ్‌బోర్డు అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ ఇందూ ప్రాజెక్టు పక్కన ఉన్న ఎల్ఐజీ గృహాలను శనివారం వెస్ట్రన్ డివిజన్ ఈఈ కిరణ్‌బాబుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పూర్వపరాలను తక్షణమే తమకు అందజేయాలని, హౌసింగ్‌బోర్డు వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇప్పటికీ అల్పాదాయ వర్గాల కోసం నిలిచిపోయిన ఎల్ఐజీ గృహాల గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కోప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శివప్రసాద్, సీపీఐ నాయకులు కృష్ణనాయక్ వివరించారు. పేదల కోసం నిర్మించకుండా బహుళ అంతస్తు భవనాలు, విల్లాలను నిర్మించుకున్నారని ఇందూ ప్రాజెక్టు గురించి ఆయనకు వివరించారు.

ప్రతీకాలనీలో సీసీరోడ్లు వేస్తాం: కార్పొరేటర్ దొడ్ల


సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ నవోదయ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో వేగంగా రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు వేస్తామని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, సయ్యద్, యాదగిరి, రాజిరెడ్డి, శివశంకర్‌రావు, మహేష్, షకీల్‌మున్నా, సంతోష్, ఖలీమ్, ఉమేష్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాల లీడర్లకు వేతనం ఇవ్వాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పొదుపు సంఘం సభ్యులు

హైదర్‌నగర్: పొదుపు మహిళా సమైఖ్య లీడర్లు శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి తాము 15 ఏళ్ల నుంచి స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నామని, తమకు వేతనం ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. దీనిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైతే విద్యార్థుల ప్రాణాలు దక్కేవే


ట్యాంకర్‌ను ఢీకొన్న కారు (ఫైల్)

దుండిగల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): దుండిగల్, బౌరంపేట సర్వీస్ రోడ్డు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి కారణమైన ట్యాంకర్ మరో ఐదు నిమిషాల్లో ఎగ్జిట్5కి వెళ్లేది. ఐదు నిమిషాల వ్యవధిలోనే ఈ ఘోర ప్రమాదం జరిగిందని తోటి విద్యార్థులు వాపోతున్నారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యంగా వెళితే విద్యార్థులు ప్రమాదం బారిన పడకపోయేవారని తోటి విద్యార్థులు వాపోతున్నారు. బాచుపల్లి ప్రాంతంలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో నిజామాబాద్‌కు చెందిన అక్షయ్(19), కరీంనగర్‌కు చెందిన అశ్మిత్(20), నవనీత్(19), జస్వంత్ (19) ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నిజాంపేట్‌కు చెందిన హరి(20) అమరావతిలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. హరి, అక్షయ్ స్నేహితులు. అక్షయ్‌ని కలుద్దామని హరి కారు తీసుకొని వీరు ఉన్న హాస్టల్ వద్దకు వెళ్లి టీ తాగేందుకు బయలుదేరారు. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 5కు రెండొందల మీటర్ల దూరంలో ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్షయ్, హరి, అశ్మిత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నవనీత్, జస్వంత్‌లకు గాయాలై సూరారంలో మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారిద్దరికి ప్రాణాపాయం తప్పిందని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఐదుగురు బైక్ దొంగల అరెస్ట్

13 లక్షల విలువ చేసే 25 బైక్‌లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ఇంటి ముందు పార్కుచేసిన వాహనాలను దొంగిలించి విక్రయిస్తున్న ఓ ముఠాను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ముఠాలోని ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేశారు. వారి నుంచి 13 లక్షల రూపాయలు విలువ చేసే 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు శనివారం వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, సింగూరుకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. విజయవాడలో ఉంటున్న ఇస్మాయిల్ కొంత కాలంగా జగద్గిరిగుట్ట చంద్రగిరినగర్‌కు చెందిన తమ సమీప బంధువు మహ్మద్‌కురేషిబాబా, మెదక్ పుల్కల్‌కు చెందిన సోహేల్‌తో కలిసి ఇళ్లముందు పార్కుచేసిన వాహనాలను దొంగిలించేవారు. ఆ బైక్‌లను సూర్యాపేటకు చెందిన మంగలిశ్యాం, కోదాడ నివాసి జోగిందర్ హుస్సేన్ వద్ద కుదువపెట్టి డబ్బులు తీసుకుని జల్సాలు చేస్తుంటారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో జీడిమెట్ల, సీసీఎస్ పోలీసులు ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి చోరీ చేసిన 36 బైక్‌లలో 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీపీ క్రైమ్స్ కె.నర్సింహ్మా, అడిషనల్ డీసీపీ పి.సత్యనారాయణ, సీసీఎస్ ఏసీపీ కళింగరావు, జీడిమెట్ల సీఐ జి.మల్లేష్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


సతీష్‌కుమార్

హైదర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్ ఎంఐజీ-870లో నివాసం ఉండే సతీష్‌కుమార్(33) ఐకాన్‌వేవ్‌లో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి తన బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాల్‌చేస్తే ఫోన్ అందుబాటులో లేదు అని సమాచారం వస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, స్నేహితులను విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో సతీష్‌కుమార్ సోదరుడు ఉమేష్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.

వైన్‌షాప్ పర్మిట్ రూంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హైదర్‌నగర్: వైన్‌షాపు పర్మిట్‌రూంలో మద్యం సేవిస్తూ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. కేపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉండే తిరుమలరావు(45) 18వ తేదీ రాత్రి మద్యం సేవించడం కోసం ఎల్ఐజీలోని బాలాజీ వైన్స్ షాప్ పర్మిట్‌రూమ్‌లో మద్యం తాగుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పర్మిట్ రూమ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే తమ సోదరుడు చనిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నకిలీ బంగారం విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

రూ.28.5 లక్షల నగదు, 20 తులాల నకిలీ బంగారు నాణేలు స్వాధీనం

జీడిమెట్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే మేలిమి బంగారమంటూ అమాయకులను మోసం చేస్తూ, నకిలీ బంగారం విక్రయించడానికి యత్నించిన ఓ ముఠా సభ్యులు ముగ్గురిని బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 28.5 లక్షల నగదు, 20 తులాల బరువు కలిగిన 100 నకిలీ బంగారు నాణేలు, 6 సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన యాషాల కామేశ్వరరావు అలియాస్ వల్లకంటి రాజు, అలియాస్ మహేష్, గుంటూరుకు చెందిన వేముల పుల్లారావు, పల్నాడుకు చెందిన బత్తుల సాంబశివరావులు ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం విక్రయిస్తున్నారు. అంతేకాక దొంగనోట్లను కూడా చెలామణి చేస్తున్నారు. విజయవాడకు చెందిన మహేష్ అనే వ్యక్తి తక్కువ ధరకే బంగారం విక్రయిస్తున్నాడని వికారాబాద్ మండలం, తాండూరుకు చెందిన కె.అంజలికి అదే ప్రాంతానికి చెందిన సంధ్య తెలిపింది. అతడి ఫోన్ నెంబర్‌కు కూడా ఇచ్చింది. దీంతో అంజలి మహేష్‌కు ఫోన్‌చేసి బంగారం కావాలని అడగటంతో 10 వేలకే తులం అమ్ముతామని చెప్పాడు. విజయవాడ రావాలని చెప్పడంతో తాను అంతదూరం రాలేనని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఈనెల 18న మహేష్ అంజలికి ఫోన్‌చేసి తనవద్ద అరకిలో బంగారు నాణేలు ఉన్నాయని మొత్తం కొనుగోలు చేస్తేనే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆశపడిన అంజలి బానురేఖ, ప్రభావతిలకు చూడా చెప్పడంతో వారు కూడా కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు. స్థానికంగా బంగారు పనులు చేసే ప్రవీణ్, బసవ అనే వ్యక్తులను తీసుకుని ఈనెల 19వ తేదీ సాయంత్రం 7 గంటలకు జీడిమెట్లలోని శుభం హోటల్‌కు వచ్చారు. మహేష్ ఫోన్‌చేసి రూమ్‌నెంబర్ 306లో ఉన్నామని, మగవాళ్లను మాత్రమే పంపించమనడంతో నగదు ఇచ్చి ప్రవీణ్, బసవలను పంపించారు. ఆతర్వాత ఆడవాళ్లు కూడా రావాలని అంజలికి మహేష్ మెసేజ్ పెట్టడంతో ముగ్గురు అక్కడికి వెళ్లారు. అప్పటికే పక్కా సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసుల దాడులు నిర్వహించి ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేశారు. వారి నుంచి బంగారు నాణేలు, నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాసులు, అడిషనల్ డీసీపీ పి.శోభన్‌కుమార్, ఏసీపీ జి.హన్మంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ పాల్గొన్నారు.


నకిలీ బంగారు నాణాలను పరిశీలిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్